క్లుప్తంగా

మొయినాబాద్ ఏఓగా అనురాధ



మొయినాబాద్: మండల వ్యవసాయాధికారిగా అనురాధ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా పనిచేసిన రాగమ్మ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న ఫర్టిలైజర్ కంట్రోలర్ ఆర్డర్ ల్యాబ్‌కు శాస్త్రవేత్తగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అనురాధ మొయినాబాద్ ఏఓగా బదిలీపై వచ్చారు.

చౌదరిగూడ ఏఓగా రాజేందర్ రెడ్డి



కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల వ్యవసాయాధికారిగా రాజేందర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా పనిచేసిన కృష్ణమోహన్ రెడ్డి రాజేంద్రనగర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో ఏఓగా పనిచేసిన రాజేందర్ రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్



సీఐ కాంతారెడ్డి, ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డికి రాఖీ కడుతున్న విజయ

షాబాద్: అన్న, చెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్ అని షాబాద్ సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ...ప్రేమానుబంధాలకు ప్రతీక రక్షాబంధన్ అని చెప్పారు. తోడబుట్టిన వారికి రాఖీ కట్టి ఆత్మీయత పంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, బ్రహ్మకుమారిలు విజయ, బస్వరాజ్, శకుంతల, మంజుల పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఉత్సవాల్లో మహిళలు, గ్రామస్తులు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో మంగళవారం ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల విన్యాసాలు, పోతరాజుల నృత్యాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి.

క్రీడలతోనే ఆరోగ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సాధించిన పతకాలను ఎమ్మెల్యేకు చూపిస్తున్న క్రీడాకారుడు శంకర్ నాయక్

షాద్‌నగర్: క్రీడలతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఎర్రబిరుసు తండాకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారుడు శంకర్ నాయక్ మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన పతకాలను ఎమ్మెల్యేకు చూపించారు. క్రీడల అభ్యున్నతికి శంకర్ నాయక్ సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. శంకర్ నాయక్ ప్రస్తుతం ఏపీలోని రాజమండ్రి ఓఎన్జీసీలో ఉద్యోగం నిర్వహిస్తున్నాడు.

దుండగులను వెంటనే శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కొందుర్గు: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులు కొందుర్గు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా మహిళలపై అత్యాచారాలు నేటికి కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కాలె యాదయ్య ● ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు

చేవెళ్ల: దేశాభివృద్ధికి స్వర్గీయ రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం మాజీ ప్రధాని జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు.

చేవెళ్ల బస్‌స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన

చేవెళ్ల మండలకేంద్రంలో నిర్మిస్తున్న బస్‌స్టేషన్ నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించారు. ఆయన వెంట వసంతం, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, శంకర్, నరేందర్, టేకుపల్లి శ్రీను, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను మ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఎదురుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కొంకళ్ల చెన్నయ్య, బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేస్తామని షాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. షాబాద్ మండల కార్యాలయంలో చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, ఖాజామీయా పటేల్, రవీందర్ నాయక్, ఆంజనేయులుగౌడ్, సుభాష్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, జానీ, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్ రూరల్: నిరుపేదలకు అండగా నిలిచిన మహనీయుడని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీసతీశ్ పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు షాబాద్ దర్శన్, మొత్కుపల్లి రాములు, దారెడ్డి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



నందిగామలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు



షాబాద్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్ తదితరులు



మొయినాబాద్ రూరల్: కేక్‌కట్ చేస్తున్న మహిళా విభాగం కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి తదితరులు

హిమాయత్‌నగర్‌లో..

చేవెళ్ల నియోజకవర్గంలో రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి కాంగ్రెస్ సభ్యులతో కలిసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఆధునిక, సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుష్పలత, చేవెళ్ల బి-బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమ్యశ్రీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: నందిగామలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్ రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్, నందిగామ పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



ఏఎస్‌ఐ గోపాల్‌ను సన్మానించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది

సీఐ శివప్రసాద్

కడ్తాల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడ విధులు నిర్వహించినా అంకిత భావంతో పనిచేయాలని సీఐ శివప్రసాద్ సూచించారు. పోలీస్‌శాఖకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. మండల కేంద్రం ఠాణాలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన చంద గోపాల్.. ఏఎస్‌ఐగా పదోన్నతి పొంది షాద్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోపాల్‌ను సీఐతో పాటు ఎస్‌ఐ వరప్రసాద్, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం సీఐ శివప్రసాద్ మాట్లాడారు. వృత్తి పట్ల బాధ్యత, అంకితభావం, ఉన్నతాధికారుల పట్ల విధేయత కలిగి ఉన్న ఉద్యోగులు.. ఎక్కడ పనిచేసినా గుర్తింపు పొందుతారని తెలిపారు. ఏఎస్‌ఐలు ప్రసాద్‌జీ, నిరంజన్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

చేసిన సేవలే గుర్తింపునకు చిరునామా

తలకొండపల్లి: చేసిన సేవలే గుర్తింపు తెస్తాయని బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ అనిల్ అన్నారు. విధినిర్వహణలో ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకోవడం గొప్ప అనుభూతిని కలిగిస్తుందని, అది ఎన్నటికీ మరువలేనిదన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన శ్రీకాంత్‌ను బీజేవైఎం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంతోనే ఎంపీడీఓకు ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందించి, ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాఘవ, ఏఈ విద్యాసాగర్, అనిల్, రాధాకృష్ణ, శివ, నాయకులు గణేశ్, రాము, సందీప్, రాజశేఖర్, ఉదయ్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న అనిల్ తదితరులు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

తలకొండపల్లి: మైదానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా గ్రామీణా క్రీడాకారులను ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి కోరారు. క్రీడలు మానసికోల్లాసం, యువతలో స్నేహ భావాన్ని పెంచుతాయన్నారు. మంగళవారం మండల పరిధి రాంపూర్‌లో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు, తదితర మెటీరియల్‌ను ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత చదువుతో పాటు ఆటల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హరిమోహన్‌రెడ్డి, మధు, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశ్, శివ, బాలకృష్ణ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్య రక్షణ

మాజీ ఎంపీపీ నిర్మల

తలకొండపల్లి: పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎంపీపీ తిర్మణి నిర్మల అన్నారు. ప్రస్తుత వర్షాలకు నీరు నిలువ ఉండడం, పరిశుభ్రత లోపించడం, తాగు నీరు కలుషితం కావడం వలన రకరకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మంగళవారం మండల పరిధి జంగారెడ్డిపల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. ఆమె ప్రారంభించారు. డాక్టర్ అఖిల్ నేతృత్వంలో 196 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు మల్లేశ్, చంద్రమౌళి, మోహన్‌రెడ్డి, మధు, వంశీ, మైసయ్య, మల్లయ్య, బుచ్చిబాబు, లక్ష్మయ్య, నరసింహ, యువకులు, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

కొత్తూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్-2020 హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తుల ప్రగతిని తెలుసుకోవడానికి, ఇతర సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని కోరారు.

సేవతోనే సమాజంలో గుర్తింపు

కడ్తాల్: సేవతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, గోపాల్, యూత్ మండల అధ్యక్షుడు ఇర్షాద్, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, పాండు నాయకులు నర్సింహ్మ, సేవ్యానాయక్, బిక్కు నాయక్ , కృష్ణ,అంజి, సేవ్యానాయక్, నర్సింహ, సూర్య, రాజు, శంకర్, కృష్ణ, శ్రీను ఉన్నారు.

వంతెన కట్టరు.. వెతలు తీరవు



సూర్యోదయ కాలనీ రోడ్డుపై చేరిన వర్షపునీరు

ఇబ్రహీంపట్నం: చిన్నపాటి వర్షాలకే రోడ్డంతా బురదమయం అవుతుందని, వంతెన ఏర్పాటుకు ఏళ్లుగా ఎదురు చూస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రాయపోల్ గ్రామం సూర్యోదయ కాలనీ ప్రజలు ఆరోపించారు. మంగళవారం కురిసిన వర్షానికి రోడ్డంతా బురదమయం అయిందని తెలిపారు. దీంతో వాహనాలు కాదు కదా.. కనీసం కాలి నడకన వెళ్లలేని దుస్థితి నెలకొందని వాపోయారు. రాయపోల్ గ్రామ సూర్యోదయ కాలనీకి, మందగూడకు వెళ్లే దారిలో వాగుపై బ్రిడ్జి నిర్మించాలని స్థానికులతో పాటు.. వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 లక్షల డీఎంఎఫ్ నిధులు కేటాయిస్తున్నట్లు గతంలో నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రకటించారు. 6 అక్టోబర్ 2023లో శంకుస్థాపన చేశారు. ఏమైందో ఏమోకాని వంతెన పనులు మొదలు పెట్టలేదు. ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పలుమార్లు సంబంధిత అధికారులు కొలతలు తీసుకున్నా.. పనుల్లో జాప్యం జరుగుతూనే ఉంది. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఎస్‌వీఎంఎల్'పై చర్యలు తీసుకోండి

కంపెనీ ఎదుట సీఐటీయూ ధర్నా

శంకర్‌పల్లి: కార్మికులతో పనులు చేయించుకుని డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ఎస్‌వీఎంఎల్ కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. మంగళవారం ఆ కంపెనీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ మాట్లాడారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌వీఎంఎల్ కంపెనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి పశ్చిమబెంగాల్ కార్మికులను వినియోగించుకుని కంపెనీ యాజమాన్యం వారికి డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న దేవేందర్, కార్మికులు

ఉత్తమ అధికారులను గుర్తుంచుకుంటారు

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

మొయినాబాద్: ప్రజలతో మమేకమై ఉత్తమ సేవలు అందించే ప్రతీ అధికారిని ప్రజలు గుర్తు పెట్టుకుంటారని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మండల వ్యవసాయాధికారిగా సుమారు 14 సంవత్సరాలు పనిచేసి బదిలీపై వెళ్తున్న రాగమ్మను మంగళవారం వీడ్కోలు సమావేశంలో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, డీలర్లు, రైతులు ఏఓను ఘనంగా సన్మానించారు. అనంతరం గీతారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు మంచి పనులు చేస్తే అలాంటి అధికారులను ఎప్పటికీ మర్చిపోరన్నారు. ఏఓ రాగమ్మ సుదీర్ఘ కాలం మొయినాబాద్ మండల రైతులు, ప్రజలకు మంచి సేవలు అందించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, ఎంఈఓ వెంకటయ్య, నూతన ఏఓ అనురాధ, ఏఈఓలు కుమార్, సునీల్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకులు కేసరి సంజీవరెడ్డి, దారెడ్డి కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, హ న్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, మాణ య్య, సత్యనారాయణ, రత్నం, మహేందర్‌రెడ్డి, డీలర్లు బాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, భానుప్రతాప్‌గౌడ్, రంగారెడ్డి, కొమురయ్య, నీలకంఠం, రవీందర్‌రెడ్డి, మీనా జుద్దీన్, ఎట్లయ్యగౌడ్, పాల్గొన్నారు.



ఏఓ రాగమ్మను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

ప్లాట్లు కోల్పోయే వారికి న్యాయం చేయాలి

చేవెళ్ల ఆర్డీఓకు వినతి

చేవెళ్ల: బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారి విస్తారణలో భాగంగా బైపాస్ రోడ్డులో ప్లాట్లు కోల్పోయే బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాంకు వినతిపత్రంలో కోరారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్లు 89, 90లలో 2016లో లక్ష్మీనగర్ పేరుపై గ్రామ పంచాయతీ అనుమతితో ప్లాట్లు చేసి విక్రయించారన్నారు. అప్పట్లోనే తాము ప్లాట్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. 2018లో బీజాపూర్‌రహదారి విస్తారణకు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. తాము కొనుగోలు చేసిన ప్లాట్లు బైపాస్ రహదారి విస్తారణ కోసం సేకరిస్తున్న భూమిలో తాము కోల్పోతున్నామని చెప్పారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. తమ ప్లాట్లను గుర్తించి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం తమకు పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, బస్వరాజ్, సందీప్‌కుమార్, వేణు, శివకుమార్, రాజేందర్‌రెడ్డి, గోవర్ధన్, సుదర్శన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నష్టపరిహారం ఇప్పించాలని ఆర్డీఓ సాయిరాంను కోరుతున్న బాధితులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

చింతకుండా తండా వాసుల వినతి

కొందుర్గు: తండాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని చింతకుండా తండా వాసులు మంగళవారం ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి వేపకుచ్చతండా నుంచి జామ్ల తండాకు వెళ్లే దారిలో 11 కేవీఏ వైర్లు వేలడుతున్నాయన్నారు. వాటిని సరి చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరిచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి ఆకాశ్‌నాయక్, రామ్‌చరణ్, వినోద్, మన్యనాయక్, రాహుల్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

గుంతలు పూడ్చివేత

చేవెళ్ల: వర్షాలం కారణంగా చేవెళ్లలోని జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను ట్రాఫిక్ పోలీసులు పూడ్చి వేయించారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్ సమీపంలో భారీ వర్షాలకు రోడ్డు పాడైంది. దీంతో అక్కడ నీరుచేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తన సిబ్బందితో కలిసి మంగళవారం గుంతలను జేసీబీ సహాయంతో చదును చేయించి అందులో కంకర, డస్ట్, సిమెంట్ పోయించారు. వాహనాలు పోయేందుకు వీలుగా రోడ్డుకు బాగు చేయించారు. దీంతో వాహనదారులు ట్రాఫిక్‌పోలీసుల పనితీరును అభినందించారు. ఈరోడ్డును బాగుచేయించాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోకపోవటంతో పోలీసులే ఇబ్బందులను గుర్తించి రోడ్డును మరమ్మతులు చేయించడాన్ని వాహనదారులు ప్రశంసించారు.



జేసీబీతో మరమ్మతులు చేయిస్తున్న సీఐ వెంకటేశం, సిబ్బంది

జోరుగా వర్షం..!

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు

శంకర్‌పల్లి: రెండు, మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షానికి శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఈ ప్రవాహాన్ని చూసేందుకు మంగళవారం చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరిన నీరు..

టంగటూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ చెరువులా మారింది. రాత్రి కురిసిన వర్షానికి పాఠశాలలో నీరు చేరింది. విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఫత్తేపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు